"అయ్యా శ్రీరామనవమి వచ్చే ఆదివారం నుంచి, ప్రతియేడులాగనే మీ చందా వెయ్యి నూట పదహార్లు రాసుకున్నాం. అది కాస్త యిప్పిస్తే" వినయంగా అన్నారు వచ్చిన పెద్దలు.

పెద్దరెడ్డి చుట్టపాయతీసి చుట్ట చుట్టి నోట్లో పెట్టుకొని కొస కొరికి తుపుక్కున ఊసాడు.

"సాయంకాలం కనపడండి యిస్తాను."

బుంగమీసాలు సవరించుకుంటూ అన్నాడు.

"ధర్మప్రభువులు, నాలుగు కాలాలపాటు చల్లగా వుండాలి. ఆ రోజు కళ్యాణంకూడా మీ చేతి మీదగనే, రాములోరి పెళ్ళి చేసేది మీరే" అన్నారు.

ఆయన ఛాతి ఉప్పొంగింది.

"వస్తాం రెడ్డిగారు" అని వచ్చిన పెద్దలు వెళ్ళిపోయారు.

పెద్దరెడ్డి ఆ వూరికి మకుటంలేని మహారాజు. వంద ఎకరాలపైన సుక్షేత్రమైన భూమి, ఓ డాబా యిల్లు వున్నాయి

ఊళ్ళో జరిగే జాతరల దగ్గర్నుంచి, కళ్యాణంవరకు ఆయన చేయి పడకుండా ఏది జరగదు. పెద్దరెడ్డికి ఊళ్ళో ఎదురులేదు

ఊరివాళ్ళందరు కల్సి ఆయన్ని ప్రెసిడెంటుగా నిలబడమంటే, "ముసలి వయస్సు నాకెందుగ్గాని, ఆ కట్టబెట్టె పదవేదో మా బామ్మర్దికి యివ్వండి" అన్నాడు.

పెద్దరెడ్డి బామ్మర్ది శంకర్రెడ్డి ఆ వూరి ప్రెసిడెంటయ్యాడు దేవుడన్నా,ఆయన ఉత్సవాలన్న పెద్దరెడ్డికి భయం, భక్తి ఎక్కువ పెద్దరెడ్డి చేయిలేకుండా ఏ రధం కదలదు ఏ దేవుడు ఉత్సవం బయల్దేరదు.

డబ్బు విషయాల్లో ఆయన కొంచెం కరుకు. వడ్డీలకు డబ్బును తిప్పి వంద ఎకరాలు సంపాదించాడు ఎవరికైనా ఎడ్డీకిస్తే వాడిపని అంతటితో సరి వాడి పొలమో, యిల్లో పెద్దరెడ్డి ఆస్థిలో కల్సిపోవాల్సిందే!

* * *

"రేయ్ ఈ చెక్కు తీసుకువెళ్ళి పట్నంలో బ్యాంకులో డబ్బు తీసుకురా" పెద్దరెడ్డి సంతకంపెట్టి చెక్కును శేఖర్‌కు యిచ్చాడు.

"రేయ్ సాయంకాలంలోపు రావాలి" అని అన్నాడు

"అలాగే నాన్నా" అని చెక్కు తీసుకొని జేబులో పెట్టుకొని బయటికి వచ్చాడు శేఖర్

వసరాలో రాఘవయ్యగారు కూర్చునివున్నారు రాఘవయ్యగారు చిన్నప్పుడు శేఖర్‌కు చదువు చెప్పిన మాస్టారు

మాస్టారుగార్ని చూడగానే,

"నమస్కారం మాస్టారుగారు ఎప్పుడొచ్చారు" అని అన్నాడు శేఖర్.



# బొమ్మల పెళ్ళి

రాఘవయ్యగారు అరిగిపోయిన చెప్పులు, చిరిగిన చొక్కాకు అతుకులు, మురికిగావున్న పంచె. మనిషి దీనంగా వున్నారు.

"ఇప్పుడే బాబు. నాన్నగారు వున్నారా ?"

"వున్నారు యింతకు మీరేపనిమీద వచ్చారు ?" అని ప్రశ్నించాడు.

రాఘవయ్యగారు యిబ్బందిగా కదిలారు. ఆయన్ని మళ్ళీ అడగటానికి మనస్కరించలేదు శేఖర్‌కు

"ఇంతకీ ఊర్నించి ఎప్పుడొచ్చావు బాబు?"

"వారం రోజులైంది"

"పరీక్షలు బాగా రాసావా ?"

"రాసానండి"

"బి ఎ చివరి సంవత్సరం కదూ.'

"అవునండి" అని అన్నాడు శేఖర్.

యింతలో పెద్దరెడ్డిగారు వచ్చారు.

"ఏం పంతులు, యిలా వచ్చావు" అన్నాడు గంభీరంగా.

"ఏరా, యింకా వెళ్ళలేదా" అన్నాడు శేఖర్ వంక చూసి

"వెళుతున్నాను నాన్నా" అని బయటికి కదిలాడు శేఖర్

రాఘవయ్యగార్ని చూడగనే శేఖర్‌కి పాత స్మృతులు గుర్తుకు వచ్చాయి.

స్కూల్లో పాఠం చదవక పోయినా, హోంవర్క్ చేయకపోయినా బెంచీ ఎక్కించేవారు. బెంచీ ఎక్కి పాఠం చదివి అప్పచెబితే కాని విడుదల లభించేది కాదు. ఒకోసారి పేము బెత్తంతో అరచేయి వెనక్కి తిప్పి కొట్టేవారు. శేఖర్ తట్టుకోలేక అప్పుడప్పు ఏడ్చేవాడు శేఖర్ యింట్లో సరిగా చదవటంలేదని మాస్టారు దగ్గరకు ప్రైవేటుకు పంపేవారు సాయంకాలం రాత్రి అక్కడే చదువుకోవటం. పిల్లలందరితో కల్సి లాంతర్ల వెలుగులో చదువుకోవటం అదో వింతగా వుండేది.

"ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపల నుండు" అని పద్యం చదువుతుంటే మాస్టారు గారి వీధి అంతా కళకళలాడుతూ వుండేది. రాఘవయ్యగారి ఒకగానొక్క కూతురు నిర్మల

"రేయ్ నిర్మల సరిగా చదువుతుందో లేదో చూస్తూవుండు" అని మాస్టారు చెప్పేవారు మాస్టారు కనుమరుగు కాగానే జేబులోనుంచి "అచ్చంగిల్లాలు" తీసి ఆడుకొనేవాళ్ళు నిర్మల, శేఖర్ ఒక జట్టు. ఓసారి శేఖర్ ఆటలో ఓడిపోయి, కోపంతో నిర్మల తలమీద రపీ, రపీ మని మొట్టికాయలు మొట్టాడు నిర్మల బిగ్గరగా ఏడ్చింది

"మా అమ్మకదు, మా బుజ్జి కదూ, ఏడుపు ఆపితే నీకు 'పెన్ను'కొని పెడతాను" అన్నాడు నిర్మల టక్కున ఆపేసింది.

నిర్మల ప్రస్తుతం ఏం చేస్తుందో!

ఎప్పుడో తొమ్మిదేళ్ళ క్రితం చూసాడు శేఖర్‌కు హైస్కూల్ చదువు పూర్తికాగానే కాలేజి కోసం పట్నం వెళ్ళిపోయాడు

ఏడోక్లాసుతో చదువు ఆపిన నిర్మలకు శేఖర్ పట్ల అభిమానం పోలేదు.


"అన్నయ్యా నాకు మెట్రిక్ కట్టాలని వుంది నాన్నేమో చదివించాలనుకుంటున్నాడు అమ్మ మాత్రం నాకు చదువొద్దని పోరుపెడుతుంది ఏం చెయ్యమంటావు" అని ఉత్తరం వ్రాసింది.

అప్పుడు శేఖర్ యింటర్ సెకండ్ యియర్ చదువుతున్నాడు

"నిర్మలా నిజంగా చదువుకోవాలనుంటే ఆ డబ్బు నేను కడతాను ఇతరుల సాయం పొందుతున్నావు అని అనుకోవద్దు నన్ను పరాయి వాడిగా భావించవద్దు. మీ నాన్న నిన్ను చదివించ పోవటానికి కారణం నీకు తగ్గ భర్తను తీసుకు రాలేను అనే భయం నీ పేర ఫీజు నేనేకడతాను కనీసం మెట్రిక్ వరకైనా చదువు ఆ చదువు జీవితంలో దేనికైనా పనికి వస్తుంది"— నీ అన్నయ్య శేఖర్.

అప్పట్నుంచి నిర్మల శేఖర్‌కు ఉత్తరాలు రాసేది యింటి పరిస్థితి, తండ్రి ఆరోగ్యం, తన చదువు, అన్నీ శేఖర్‌కు వ్రాసేది కానీ గత మూడేళ్ళనుంచి నిర్మల ఉత్తరాలు రాయటం






ఆపేసింది. శేఖర్ నిర్మలను కలుద్దామని ఊర్లోకి వస్తే కనపడేది కాదు. ఎప్పుడు శేఖర్ యింటికి ఛెంగుఛెంగున వచ్చేది. ఎదురుపడినా తప్పుకొని పోవటం గనించేసరికి శేఖర్‌కు ఏమీ అర్థంకాలేదు

తరువాత అర్థం చేసుకున్నాడు.

అతనితో మాట్లాడితే లోకం మరోరకంగా భావిస్తుందని తెలుసుకున్నాడు నిర్మలలో అతని పట్ల అభిమానం గౌరవం ఏ మాత్రంతగ్గలేదు నిర్మల తెలివితేటలకు అభినందిచకుండా ఉండలేక పోయాడు.

*　　　*　　　*

డబ్బుతెచ్చి యిచ్చాడు శేఖర్.

పెద్దరెడ్డి లెక్కపెట్టుకొని బీరువాలో పెట్టాడు

"నాన్నా ఉదయం రాఘవయ్యగారువచ్చారు ఎందుకోసం" అని అడిగాడు.

పెద్దరెడ్డిగారు శేఖర్ వంక వింతగా చూసాడు పై కండువా దులుపుకొని జేబులో నుంచి పొగాకుపాయ తీశాడు

"ఆయన కూతురు పెళ్ళికి అప్పుకావాలంట" చుట్టచుట్టి నోటితో కొస కొరికి తుపుక్కున ఊసాడు.

"మీరేమన్నారు."

"ఆ య న కు ఆస్థి, పాస్తి, లేదు పొమ్మన్నాను" పొగాకు చుట్ట నోట్లో పెట్టి అగ్గిపుల్ల వెలిగించారు.

"అదేమిటి నాన్నా ఆయనకు యిల్లుందిగా."

చుట్ట వెలిగించుకొని చిద్విలాసంగాచూస్తూ చిరునవ్వు నవ్వారు పెద్దరెడ్డిగారు

"ఆ యింటిమీద అప్పు పాపంలా పెరిగింది. రేపో, మాపో మన లెక్కలో రాయించేస్తాను" తాపీగా అన్నాడు.

"వెర్రి బ్రాహ్మడు, మనదగ్గరేవో రత్నాల రాసులున్నాయనుకుంటున్నాడు" చు ట్ట ను తన్మయంగా పీలుస్తూ కుర్చీలో జారిగిలపడ్డాడు

శేఖర్‌కు గుండెల్లో కలుక్కుమంది. తండ్రి అలా ఖరాఖండిగా మాట్లాడటం బాధ కలిగించింది పాపం అందుకనేకాబోలు బిడయబడ్డారు రాఘవయ్యగారు తనతో చెప్పటానికి. నిర్మల పెళ్ళికి తండ్రి ఏ మాత్రం సాయం చెయ్యక పోవటం అమానుషంగా, దారుణంగా తోచింది శేఖర్‌కు.

"అయ్యా పెద్దరెడ్డిగారు" బయటనుంచి పిల్పు. శేఖర్ చూసాడు. ఉదయం శ్రీరామనవమి చందాకోసం వచ్చిన భక్తబృదం.

పెద్దరెడ్డిగారు లోపల్నుంచి వెయ్యి నూట పదహార్లు లెక్కపెట్టి బయటికి వచ్చారు

"ఇదిగో మీ చందా" జాగ్రత్తగా వాళ్ళకు అందించాడు.

శేఖర్‌కు రాఘవయ్యగారి దీనమైన ముఖం కళ్ళముందు కదిలింది. పెళ్ళికెదిగిన కూతురు గుండెలమీద కుంపటిలా వుంది

"బాబు, పదేళ్ళుగా ఈ వూళ్ళో రాముల వారి కళ్యాణం చేయిస్తున్న ధర్మప్రభువులు మీ వంశం పిల్లాపాపలతో ఆ యు రా రో గ్య, ఐశ్వర్యాలతో కళ కళలాడుతూ వుం డా లి" పెద్దరెడ్డిని దీవించారు భక్తబృందం

శేఖర్ చిన్నగా నవ్వుకున్నాడు

శ్రీరామ కళ్యాణానికి వెయ్యి నూట పదహార్లు యిచ్చిన తండ్రి, ఓ పేద బ్రాహ్మడి కూతురు పెళ్ళికి దమ్మిడీ రాల్చలేదు. ఎంత విచిత్రం ! ప్రాణంలేని బొమ్మలకు పెళ్ళిళ్ళు !

ప్రాణంవున్న బొమ్మలకు చావు బాజాలు!

అప్రయత్నంగా అతని కంట క న్నీ రు తిరిగింది.

*　　　*　　　*

"మాస్టారుగారు, మాస్టారుగారు" శేఖర్ పిల్చాడు.

"ఎవరూ" లోపల్నుంచి నిర్మల బయటికి వచ్చింది.

శేఖర్ ఆమె వంక విచిత్రంగా చూసాడు. నిర్మల చాలా మారిపోయింది. పెద్దెనిమిదేళ్ళ యవ్వనం, కుటుంబ బాధ్యతలు ఆమెకో పెద్దరికాన్ని తెచ్చిపెట్టాయి

"నిర్మలా" అన్నాడు ఉద్వేగంగా.

"ఎవ్వరూ" అని పరీక్షగా చూసి—

"శేఖరన్నయ్యా, చాలా మారిపోయావు" అంది. అన్నయ్యను చూడగానే ఆమె కళ్ళు మెరిసాయి

"లోపలికిరా, ఎన్నాళ్ళయిందో నిన్ను చూసి" గబగబ వెళ్ళి కుర్చీవేసింది శేఖర్ కుర్చీలో కూర్చున్నాడు. నిర్మలను చూడగానే అతనికి ఆనందంగా వుంది

"ఏం ఏమిటే, నీ పెళ్ళి అని విన్నాను నిజమేనా ?"

"ఫో, అన్నయ్య" అని సిగ్గుపడింది

"నాతో చెప్పలేదు మీ నాన్న"

"నాన్నగారు నాకూ చెప్పలేదు నువ్వు కలిసావని" అంది.

"నాకు చెప్పినట్లయితే ఏదో సహాయం దొరికేది."

నిర్మల మౌనంగా టే బు ల్ మీ దు న్న పుస్తకాన్ని తిరగేస్తూ నిలబడింది ఇతరుల సహాయ సహకారాలు పొందే స్థితిలో వున్నందుకు ఆమె బాధపడింది

"ఏం నిర్మల మాట్లాడవు

మీ నాన్నగారు ఉదయం మా నాన్నగార్ని కలిసారు"

"మీ మాన్నగారు డబ్బులు యివ్వనవి చెప్పారు, నాన్నొచ్చి అన్నం తినకుండా పడుకున్నారు" చటుక్కున వెనక్కి తిరిగింది ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు

"నాన్నకు, ఈ యింటికి, చెప్పలేని అనుబంధం, నా కోసం ఈ యిల్లు అమ్మేద్దామనుకున్నారు. కానీ, కానీ . మీ నాన్నగారు నాన్నకు ఆ ఆశకూడా లేకుండా చేసారు. కుదుర్చుకున్న పెళ్ళి పురుటిలోనే సంధికొట్టింది" ఆమె చెంపలమీద నుంచి కన్నీళ్ళు జారి పోతున్నాయి.

"అన్నయ్యా, నాన్నతో చెప్పేస్తాను నాకు పెళ్ళి వద్దని, లేకనేతే నాన్న పిచ్చివాడైపోతాడు నా పెళ్ళికాక, యిల్లులేక నాన్న చిత్రవధ అను

భవిస్తున్నాడు'' నిర్మల కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

''వరుడెవరు నిర్మలా ?''

''రామాపురంలో పూజారి, ఆయన కూడా పేదవాడే. కట్నం అడక్కపోయినా పెళ్ళి జరిగితే చాలు అనుకుంటున్నాడు నాన్న. పాపం కనీసం నా పెళ్ళి చూసే అదృష్టం లేదు నాన్నకి'' బాధగా అంది. చెంపలమీద జారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంది

''నిర్మలా, మీ నాన్నగార్ని పిలువు'' అన్నాడు శేఖర్.

నిర్మల లోపలికి వెళ్ళింది

శేఖర్ యింటి వంక చూశాడు సున్నంలేక గోడలు పెచ్చులూడిపోతున్నాయి. కప్పుకి వేసిన బంగాళా పెంకు అక్కడక్కడా పగిలిపోయింది. నేడో, రేపో కూలిపోవటానికి సిద్ధంగా వున్న కొంపలా వుంది.

రాఘవయ్యగారు వచ్చారు.

''బాబు శేఖర్ నువ్వా! ఏమిటి బాబు ''

అప్పుడే లేచినట్లున్నారు కాబోలు. ముఖం కడుక్కొని వచ్చి పడక్కుర్చీలో కూర్చున్నారు. కుర్చీ భారంగా మూల్గింది.

''పెళ్ళి ఎప్పుడు నిశ్చయం చేసారు మాస్టారు.'' సూటిగా అడిగాడు శేఖర్.

రాఘవయ్యగారి కళ్ళల్లో అవ్యక్తమైన బాధ కన్పించింది. అది కనపడకుండా చూపు మరో వైపు తిప్పారు.

''నవమి వెళ్ళిన మూడోరోజున పెళ్ళి అని లగ్నపత్రిక రాయించాం'' అని అన్నారు

''నాన్నగారు డబ్బేమైనా యిచ్చారా మాస్టారు.''

ఆయన తలెత్తాడు. అనుభవాలను ప్రోది చేసుకున్న నుదురు బాధతో ముడుచుకున్నారు

''లేదు బాబు''

''నాన్నగారేమన్నారు ''

''పూర్వపు బాకీలకు యిల్లు తనఖాకి తీసుకున్నారు. దానితాలూకు మిగులు ఓ రెండు వందలు యిచ్చారు ''

''ఇల్లు తన పేర రాయించుకుంటాడు, అంతేనా'' ఆవేశంగా అన్నాడు శేఖర్.

ఆయన అంత బాధలోను చిరునవ్వు నవ్వారు

''బాబు నువ్వు చిన్నవాడివి, నీకు యింకా అనుభవం రాలేదు. ఈ విషయంలో నాన్నగార్ని ఏమీ అనకు'' అన్నారు.

ఆయన ఔదార్యానికి శేఖర్‌కు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

''మాస్టారు, పెళ్ళి కెంత కావాలి.''

''నీకెందుకు బాబు మా తిప్పలేవో మేం పడతాం'' బాధగా అన్నాడు ఆయన

''కాదు మాస్టారు. చెప్పండి.''

# బొమ్మల పెళ్ళి

''ఓ వెయ్యి రూపాయిలైతే ఈ పేదవాడింట్లో ఓ పెళ్ళి జరిగిపోతుంది.''

నిర్మల కాఫీ తీసుకువచ్చి యిచ్చింది. శేఖర్ కాఫీ తీసుకున్నాడు

రాఘవయ్యగారి పరిస్థితి శేఖర్ని కలిచి వేసింది.

ఈ దేశంలో ఓ సామాన్యుడు తన కూతురు పెళ్ళి చేయాలంటే యిల్లు అమ్ముకొని నిరాశ్రయుడు కావటమో, అప్పులపాలవ్వటమో జరుగుతుంది.

''మాస్టారు పెళ్ళి నవమినాడు జరిగినా అభ్యంతరంలేదుగా.''

''ఏం బాబు'' అనుమానంగా అడిగారు

''నేనా డబ్బు సర్దుతాను మాస్టారు, కానీ పెళ్ళి నవమినాడు చెయ్యాలి.'' శేఖర్‌లో ఓ నిర్ణయం స్థిరంగా రూపుదాల్చింది

రాఘవయ్యగారు యిబ్బందిగా చూసాడు

''మాష్టారు మీకో పెద్దకొడుకుంటే తన చెల్లెలు పెళ్ళి కోసం కష్టపడడా ?'' అని అన్నాడు శేఖర్.

రాఘవయ్యగారు ముఖంలో సంతృప్తి చోటు చేసుకుంది

* * *

''నాన్న ఈ సంవత్సరం నేను శ్రీరామ కల్యాణం చేయిస్తున్నాను నాకు మొదట నీ చందా వెయ్యాలి'' అన్నాడు శేఖర్

కొడుకువంక విస్మయంగా చూసాడు పెద్దిరెడ్డి.

''మనవూరిలో చాల సంవత్సరాలనుంచి ఒకే పందిరిలో శ్రీరామ కళ్యాణం జరిగింది ఈ సంవత్సరం మంచి నా రెండో పందిరిలో కూడా శ్రీరామ కళ్యాణం జరుగుతుంది'' అన్నాడు శేఖర్

''ఉన్న ఆ ఒక్కటే చాలురా.''

''ఊరు పెరిగింది, నీ ప్రెస్టేజీ పెరిగింది ఈ ఊరికి ఇంకో పందిరి కూడా వుంటే నీ ప్రెస్టేజీ ఎంత పెరుగుతుందో తెలుసా నాన్నా'' అన్నాడు

పెద్దరెడ్డి సుముఖుడు కాలేదు.

''దేవుడు నాన్నా! దేవుడు కళ్యాణం రెండు చోట్ల చేయిస్తే మన ఆదాయం రెట్టింపవుతుంది.'' పెద్దిరెడ్డిని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టాడు

కొడుక్కి నూటపదహార్లివ్వబోయాడు

''నీ ప్రెస్టేజీకి కనీసం అర్థ వెయ్యినూట పదహార్లు యివ్వాలి'' పెద్దరెడ్డి యిచ్చాడు. శేఖర్ సరాసరి మావయ్య శంకర్రెడ్డి దగ్గరకు వెళ్ళాడు

''మా వయ్య, నువ్వు ఈవూరికి ప్రెసిడెంటువు. మా నాన్న ఓ పెద్ద పందిరిలో కళ్యాణం చేయిస్తే కనీసం నువ్వు మరో పందిరిలో నన్నా కళ్యాణం చేయించాలి''అన్నాడు

శంకర్రెడ్డి దగ్గర ఒక అర్థ వెయ్యినూట పదహార్లు ! సర్పంచుల దగ్గర నూటపదహార్లు చొప్పున వసూలు చేశాడు చిన్నచిన్న కుర్రాళ్ళకు ''శ్రీరామ నవమి చందా'' అని రాసిన డబ్బాలిచ్చి ప్రజల దగ్గర చందా వసూలు చేసాడు.

డబ్బు బాగానే పోగయింది. శేఖర్ సంతృప్తి పడ్డాడు. ఊరంతా సంబరంగా వుంది. రెండో రోజు ఆదివారం ఊర్లో పెద్ద పందిరి అప్పటికే తయారైంది.

రామాలయం మంచి వీధివరకు చాలా పొడుగు వుంది పందిరి. ట్యూబ్ లైట్లు, మైకులు, సినిమాపాటలు అన్నీ సిద్ధమయ్యాయి.

అట్టహాసం, రంగుల లైట్లు, ఆ ఊర్లో శ్రీరామనవమి తొమ్మిది రోజులు చేస్తారు డ్రామాలు, హరికథలు, చివరిరోజు సిన్మాతో మంగళహారతి పాడేస్తారు

శేఖర్ పందిరి మాస్టారుగారి యింటి ముందు వేసాడు అది సగం వీధిని ఆక్రమించింది ఆ రెండో పందిరి ఊళ్ళో చాలా మందిని ఆకర్షించింది

పందిరికి మామిడి తోరణాలు కట్టారు

మాస్టారుగారి గడపలకు పసుపు రాసారు ఇల్లంతా సున్నం కొట్టించారు అందరి ముఖాల్లో సంతోషం తాండవిస్తోంది

తెల్లవారితే శ్రీరామ కళ్యాణం

శేఖర్‌కు సంతృప్తిగా వుంది

తాను అనుకున్నది సగం సాధించాడు మిగతా సగంకూడా సక్రమంగా జరిగితే నిర్మల ఓ యింటిదవుతుంది

ఆ రాత్రి పెద్దరెడ్డి శేఖర్ని అడిగారు

''ఆ పందిరి మాస్టారిగారి యింటిముందు ఎందుకు వేయించావు ''

''అంతకన్నా మంచివీధి ఈ వూర్లోలేదు'' అని కరుకుగా సమాధానమిచ్చాడు. విస్మయంగా కొడుకువంక చూసాడు పెద్దరెడ్డి ఆయనకు కొడుకు ప్రవర్తన విచిత్రంగా అన్పించింది

శేఖర్ ఆ రాత్రంతా అలంకరణలు చేస్తున్నాడు పందిరి చాలా అందంగా, అద్భుతంగా తయారైంది

* * *

శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు అలంకరించి వున్నాయి వివాహవేదిక రంగు రంగుల కాయితాలతో అలంకరింపబడి క్రొత్త శోభలీనుతోంది ఆ వివాహ వేదికకు ప్రక్కనేవున్న చిన్న మందిరంలో విగ్రహాలు వున్నాయి

పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు!

నిర్మల పెళ్ళికూతురు దుస్తుల్లో పీటల మీద కూర్చోనివున్నది ఆమె ప్రక్కనే వరుడు పెళ్ళి దుస్తుల్లో ఆసీనుడై వున్నాడు

శేఖర్ ఓ ప్రక్కగా నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు.

క్రింద అంతా పిల్లలు కూచునివున్నారు రాఘవయ్యగారి కళ్ళల్లో కోటి వెలుగులు

శంకర్రెడ్డి గబగబ అక్కడకు వచ్చాడు. ఆయన వెనక సర్పంచులు, ఆ వూరి ప్రజలు వచ్చారు.

వివాహ వేదికను చూసేసరికి ఆయన నిప్పు తొక్కిన కోతిలా లేచాడు.

"ఒరేయ్ శేఖర్ ఏమిట్రా యిది, మమ్మల్ని పిల్చి యిలా అవమానం చేస్తావా ?"

"ఏం చేసాను మామయ్య, యివాళ కళ్యాణం వుంది. నువ్వు దగ్గరుండి చేయించమని అడిగాను అంతేగా" అన్నాడు తాపీగా. ఆయన కోపం తారాస్థాయి నందుకుంది.

"తెలుసులేవోయ్. పవిత్రమైన దేవుడి పెళ్ళిలో ఈ పనేమిటి ? యిందుకనేనా మా దగ్గర నువ్వు చందాలు తీసుకుంది."

"మామయ్య, కొంచెం ప్రశాంతంగా మాట్లాడు"

"ఎవరో దారినపోయే దానయ్యల పెళ్ళి చేయటానికి నీకేవన్నా లక్షలున్నాయా ! అయినా ప్రజల డబ్బుతో ఆ పని చేయటానికి నీకు సిగ్గు లేదు ఏం మీరు మాట్లాడరు" అన్నాడు తన వెనక వున్న సర్పంచుల నుద్దేశించి.

"అవును. అవును మా డబ్బుతో దిక్కుమాలిన వాళ్ళ పెళ్ళి చెయ్యటానికి నీకు సిగ్గు లేదు" ఆవేశంగా అన్నారు వాళ్ళు.


"ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు" ముక్తకంఠంతో అన్నారు.

"ఏం, ఎందుకు జరగటానికి వీల్లేదు. శ్రీరాముడు, సీతా భార్యాభర్తలు. వీళ్ళిద్దరి పెళ్ళి ఎప్పుడో కృతయుగంలోనే జరిగిపోయింది అప్పట్నుంచి వాళ్ళ బొమ్మల్ని పెట్టి మనం బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తున్నాం, వడపప్పు తింటున్నాం పానకం తాగుతున్నాం చిన్నపిల్లలు చిన్న చిన్న బొమ్మలతో లక్కపిడతలతో గుప్పెడు శనగలతో బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటారు వాళ్ళకు మనకు తేడా ఏమిటి ? ఈ దేశంలో ఆడపిల్లల తల్లిదండ్రులు పెళ్ళికెదిగిన కూతుళ్ళ పెళ్ళిళ్ళు చెయ్యలేక మరణించేవాళ్ళు ఎంతమందో! పెళ్ళిచేసి బిచ్చగాళ్ళైపోయిన వాళ్ళెందరో! వాళ్ళందర్ని మర్చిపోయి, మనం లక్షలకొద్దీ ధనాన్ని శ్రీరామ కళ్యాణం పేరిట వృధా చేస్తుంటే ఆ రాముడు సంతోషిస్తాడా ? ఎందరో స్త్రీలు పెళ్ళికాక పతితలుగా, భ్రష్టలుగా మారుతుంటే ఆ సీతమ్మ తల్లి సంతోషిస్తుందా ?"

అందరూ మౌనంగా వింటున్నారు

"శ్రీరామ కళ్యాణం రోజున ఓ పేదవాడి కూతురు పెళ్ళి తన పందిట్లో తన పేరుమీద జరిగిందంటే ఆ భగవంతుడికి అంతకన్నా కావల్సిందేవుంది

## ఇవేమన పద్యాలు




కులమువలన కొంత బలమువలన కొంత
తలిమివలన కొంత గర్వమునను
పెంకె చదువు చదివి మంకులైపోదురు
విశ్వదాభిరామ వినుర వేమ.

బొమ్మలపెళ్ళి చేసే పని మనస్సును దాటి వచ్చేసాం ! అంతగా 'ఆ కోర్కెవుంటే ప్రాణం వున్న బొమ్మలకు పెళ్ళిచేయండి అదే శ్రీరామ కళ్యాణం చేయించినంత ఫలం. అంతేకాని ధనాన్ని మాత్రం వృధా చేయవద్దు." శేఖర్ ఉద్వేగంగా అన్నాడు.

శేఖర్ అన్న మాటల్లోని సత్యం అక్కడకు వచ్చిన పెద్ద మనుషుల బుర్రలోకి చొరబడింది శేఖర్ పని సబబుగానే కన్పించింది

అందరి ముఖాల్లోని ప్రశాంతతను చూసి శంకర్రెడ్డి లాభంలేదు అనికొని ముందుకు వచ్చి అభినందిస్తున్నట్లు శేఖర్ భుజం చరిచారు

రాఘవయ్యగారి కళ్ళల్లో కొత్త వెలుగు వచ్చింది.

"భజంత్రీలు వాయించండి" అన్నాడు పురోహితుడు

"మాంగల్యం తంతు నా మే మమజీవన హేతునా."

మంత్రాలు వినపడుతుండగా, శేఖర్ చేతిలో ఎవరో అక్షతలు వుంచారు ★